ప్రజాశక్తి
మంగళవారం 22 ఆగస్టు 2023
5
శ్రీ సత్యసాయి





మున్సిపల్ కార్మికులను అరెస్టు చేస్తున్న పోలీసులు

కర్నాటక వైపు రఘువీరా చూపు

పార్లమెంటు ఎన్నికల బరిలో దిగుతారా..?



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మాజీ పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి చూపు కర్నాటక రాజకీయాల వైపు మళ్లిందా అన్న చర్చ రాజకీయాల్లో నడుస్తోంది. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కర్నాటక నుంచి పోటీ చేసే అవకాశాలున్నట్టు ప్రచారం సాగుతోంది. కర్నాటక రాజకీయాల్లోనూ చర్చ నడుస్తున్నట్టు అక్కడి మీడియా కథనాలు కూడా రావడం బలాన్ని చేకూరుస్తోంది. ఇటీవల కర్నాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ కొన్ని నియోజకవర్గాలను ఎంపిక చేసుకుని ఆయన పాల్గొన్నారు. ఆ ప్రాంతాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయాలు సైతం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, అనంతపురం జిల్లాలోనూ ఎన్.రఘువీరారెడ్డికి ప్రత్యేకమైన స్థానముంది. మూడు పర్యాయాలు మంత్రిగానూ పనిచేశారు. వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ మంత్రిగా పనిచేశారు. అనంతపురం జిల్లాపైనా ఆయనకు ప్రత్యేకమైన స్థానముంది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెసు పార్టీ పూర్తిగా దెబ్బతింది. ఈ సమయంలోనూ ఆయన పిసిసి అధ్యక్ష బాధ్యతలను చేపట్టి పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు సాయశక్తుల కృషి చేశారు. కాని 2019 ఎన్నికల్లోనూ కాంగ్రెసు పార్టీలో మెరుగుదల కనిపించలేదు. అప్పటి నుంచి పిసిసి అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకున్నారు. రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. స్వగ్రామానికే పరిమితమయ్యారు. ఆయన ఊరు నీలకంఠాపురంలో దేవాలయాల నిర్మాణాలు చేపడుతూ పూర్తిగా ఆధ్యాత్మిక మార్గం వైపు నడిచారు. ఇక రాజకీయాలకు దూరమైనట్టే అన్న భావన సైతం అందరిలోనూ నెలకొంది. అయితే తిరిగి కాంగ్రెసు జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ దేశ్ జోడో యాత్ర సమయంలో ఆయనతోపాటు కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని డీ.హీరేహాల్ ప్రాంతంలో పాల్గొన్నారు. అనంతరం ఇటీవల జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొన్నారు. తుముకూరు ప్రాంతంలోని 23 అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అక్కడ కాంగ్రెస్‌కు మంచి ఆధిక్యత కూడా వచ్చింది. ఈ నేపథ్యంలో ఆయన్ను వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో అక్కడి నుంచి బరిలో దింపితే ఎలాగుంటుందన్న ఆలోచనలో ఆ పార్టీ వర్గాల్లో సాగుతున్నట్టు సమాచారం. ఈ ప్రచారంతో ఆయన ఇప్పటి వరకు ఉన్న మౌనం వీడి ఇక క్రియాశీలకంగా మారుతారా అన్నది చర్చనీయాంశమవుతోంది. ఇప్పటి వరకు ఆయన పార్టీ మారుతారా అన్న ప్రచారానికి తెరపటినట్టే కనిపిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి దయనీయంగా మారడంతో అటు టిడిపిగాని, ఇటు వైసిపిగాని చేరుతారన్న ప్రచారం ఇక్కడ సాగింది. కాని అందుకు భిన్నంగా ఆయన కాంగ్రెస్ పార్టీలోనే పక్క రాష్ట్రం వైపు మొగ్గుపుతున్నట్టు కనిపిస్తున్నారు. ఇప్పటికే ఆయనకు సిడబ్లుసి శాశ్వత సభ్యుడిగానూ నియమించింది. దీన్నిబట్టి కాంగ్రెస్ అధిష్టానం కూడా ఆయనకు ఏ మేరకు ప్రాధాన్యతనిస్తోందన్నది స్పష్టమవుతోంది. జాతీయ స్థాయిలో కీలకమైన కమిటీలో చోటు కల్పించడం మరింత ప్రాధాన్యత కల్పించినట్టయింది. కర్నాటక కాంగ్రెసు రాజకీయాల్లోనూ ఆయన క్రియాశీలకంగా మారే అవకాశాలున్నట్టు రాజకీయ విశ్లేషకులు సైతం భావిస్తున్నారు.

మున్సిపల్ కార్మికుల బైక్ ర్యాలీ అడ్డగింత

కార్మికుల అరెస్టు, విడుదల

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమస్యల పరిష్కారం, 24న నిర్వహించనున్న చలో విజయవాడను విజయవతం చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సోమవారం నాడు పుట్టపర్తిలో బైక్ ర్యాలీ చేపట్టారు. హనుమాన్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. పుట్టపర్తిలో నిరసన ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతులు లేవంటూ సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి ఆధ్వర్యంలో నాయకులను అరెస్టు చేశారు. సాయంత్రం వరకు పోలీసు స్టేషన్‌లో ఉంచుకుని అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టుల సందర్భంగా కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సమస్యల పరిష్కరించమని శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే ఇలా పోలీసులు అడ్డుకుని అరెస్టులు చేయడం దుర్మార్గం అని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలంటూ పలుమార్లు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. కార్మికులందరినీ పర్మనెంట్ చేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. గ్ర్యాడ్యూటీ సౌకర్యం కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలన్నారు. హెల్త్ మరియు రిస్క్ అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు అమలుతోపాటు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు 18,500 వేతనం ఇవ్వాలన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీగా ఆందోళనలు ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు రామయ్య, గోవిందు, నాగార్జున, పెద్దన్న, ఇంజనీరింగ్ నాయకులు, రమణ, గణేష్, రామదాసు, సురేంద్ర, సత్యం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

విచారణ తర్వాతే కొండూరు భూములపై తుది నిర్ణయం

డిఆర్ఒ కొండయ్య

ప్రజాశక్తి-లేపాక్షి

మండల పరిధిలోని కొండూరు పొలంలోని తమ భూములను తమకు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ దళిత రైతులు వారం రోజుల నుంచి స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం కూడా ధర్నా చేపట్టగా జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య తహశీల్దార్ కార్యాలయం చేరుకుని రైతులు, అధికారులతో చర్చించారు. అనంతరం డిఆర్ఒ మాట్లాడుతూ సదరు భూములపై పూర్తి విచారణ తగిన నిర్ణయం తీసుకొంటామని తెలిపారు. అలాగే 1954 తర్వాత ప్రభుత్వం ఇచ్చిన భూములపై పూర్తి వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ మాట్లాడుతూ కుశలవ సంస్థ యాజమాన్యం భూముల అభివృద్ధి పేరుతో కొండూరు గ్రామంలో 40 మంది రైతులతో 146 ఎకరాల భూమి తీసుకున్నారన్నారు. భూమి తీసుకు నే సమయంలో అందులో బోర్లు వేసి, ఇతర అభివృద్ధి పనులు చేసి సంవత్సరానికి లీజు రూపంలో రైతులకు నగదు ఇస్తామని లీజు అగ్రిమెంట్ రాసుకున్నారన్నారు. ఆ తర్వాత ఆ భూముల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని, దీంతో దళిత రైతులు తీవ్రంగా నష్టపోయారని, కావున తక్షణమే వారి భూములను వారికి ఇప్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కుశలవ సంస్థ యాజమాన్యంపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ధర్నాలో గోపాల్, ప్రవీణ్‌కుమార్, బాధిత రైతులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టిన రైతులు

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మడకశిర

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పట్టణంలోని శ్రద్ధ ఇంటలెక్చువల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు కరస్పాండెంట్ రాధాకృష్ణ తెలిపారు. అనంతపురం నగరంలోని ఎఎస్ఎస్‌సిఎఫ్ఐ ఛాంపియన్ టోర్నీలో భాగంగా నిర్వహించి న పోటీల్లో పట్టణంలోని రంగాపురం సమీపంలోని శ్రద్ధ ఇంటలెక్చువల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచారు. మారుమూల ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలోని శ్రద్ధ ఇంటలెక్చువల్ పాఠశాల విద్యార్థులు క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి మొదటి స్థానం సాధించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన శ్రద్ధ ఇంటలెక్చువల్ పాఠశాల విద్యార్థులు

అక్రమ కట్టడాలను నియంత్రించాలి

సోమందేపల్లి : స్థానిక ధనలక్ష్మి రోడ్డు, మారుతినగర్‌లలో పలువురు అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని, వాటిని నియంత్రించాలని స్థానిక మహిళలు సోమవారం మేజర్ పంచాయతీ కార్యదర్శి నాగమునికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ సోమందే పల్లిలో పలువురు రోడ్లు, మురికి కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. దీంతో డ్రైనేజీల్లో మురుగునీరు ముందుకు కదలక దుర్వాసన వెదజల్లుతోందన్నారు. దీనికి తోడు దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని, కావున పంచాయతీ సిబ్బంది స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు పాల్గొన్నారు.

పావగడ తాలూకా జెడిఎస్ అధ్యక్షునిగా ఈరన్న

మడకశిర : నియోజకవర్గానికి ఆనుకొని ఉన్న పావగడ తాలూకా జెడిఎస్ పార్టీ అధ్యక్షుడిగా న్యాయదగుంట ఎన్ఎ ఈరన్నను నియమించారు. ఈరన్న గతంలో పార్టీ తాలూకా కార్యదర్శిగా పార్టీ అభివృద్ధికి తన వంతుగా కృషి చేశారు. దీంతో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కుమారస్వామి పావగడ తాలూకా అధ్యక్షునిగా నియమించడం పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.



తహశీల్దార్‌కు సన్మానం

సోమందేపల్లి : మండల తహశీల్దార్ సురేష్‌కుమార్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ పి.అరుణ్‌బాబు నుంచి ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. దీంతో మండలంలోని పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది సోమవారం తహశీల్దార్‌ను దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, ఎంఇఒ ఆంజనేయులునాయక్, ఇఒఆర్‌డి నాగరాజురావు, ఎఇఒ అలేఖ్య, వెలుగు ఎపిఒ రామాంజనేయులు, ఉపాధి, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా 'వైఎస్ఆర్ చేయూత' పేర్ల నమోదు

లేపాక్షి : మండలంలో వైఎస్ఆర్ చేయూత లబ్ధిదారుల పేర్ల నమోదును వేతవంతం చేయాలని హిందూపురం డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. ఆయన సోమవారం స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయాన్ని, లేపాక్షి ఏరియా పశువైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జగనన్న పాలవెల్లువలోని మహిళా డైరీ సమాఖ్య కింద జరుగుతున్న రైతు నమోదు ప్రక్రియపై సమీక్షించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్‌రావు, డాక్టర్ శివశంకరనాయక్, డాక్టర్ కిశోర్, పాల్గొన్నారు.

ఐటిఐ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

లేపాక్షి : స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ప్రవేశానికి 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 27వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రాయపురెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో అడ్మిషన్ కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఫర్టిలైజర్ షాపు సీజ్

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని న్యూ రైతు మిత్ర సీడ్స్, ఎరువుల దుకాణాన్ని సోమవారం వ్యవసాయ శాఖ ఎడి అల్తాఫ్ అలీ ఖాన్ తనిఖీ చేశారు. లైసెన్సు లేకుండా దుకాణం నడుపుతున్నట్లు గుర్తించి సీజ్ చేసినట్లు ఎఒ మునికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ యజమాని లైసెన్స్ లేకుండా ఎరువుల దుకాణం నడుపుతుండడంతో పాటు ఎలాంటి రశీదులు లేకుండా ఎరువులు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. అలాగే గోదాములో అనధికారికంగా ఉన్న రూ. 85,620 విలువ చేసే ఎరువు లను సీజ్ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. ఫర్టిలైజర్ షాపుల్లో ఎరువులు కొనే రైతులు ప్రతి దానికి రశీదు పొందాలని ఆయన సూచించారు.

గడువులోగా స్పందన అర్జీలకు పరిష్కారం

◆25న పెనుకొండ అసెంబ్లీ అభివృద్ధిపై సమావేశం ◆కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

స్పందన అర్జీలను పెండింగ్ లేకుండా గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో కలెక్టర్ 176 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు డిఆర్ఒ కొండయ్య, డిఆర్‌డిఎ పీడీ నర్సయ్య, ల్యాండ్ సర్వే ఏడీ రామకృష్ణ, డిపిఒ విజయ్ కుమార్, సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ పర్చువల్ విధానంలో ఆయా శాఖల అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీఓపెన్ పిటీషన్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులు వీటిని నిత్యం పరిశీలిస్తూ ఉండాలని చెప్పారు. రెవెన్యూకు సంబంధించి ఎక్కువ అర్జీలు వస్తున్నాయని, దీనిపై డిఆర్ఒ ఆయా మండలాల తహశీల్దార్లతో సమీక్షించాలని సూచించారు. ఈనెల 25న పెనుకొండ నియోజకవర్గంకు సంబంధించిన అభివద్ధి కమిటీ సమావేశాన్ని పుట్టపర్తిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మనూరు జయరాం హాజరవుతారని చెప్పారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకోవాలన్నారు. గతంలో నిర్వహించిన సమావేశాల్లో పుట్టపర్తి, మడకశిర, కదిరి, నియోజకవర్గాల సమగ్ర నివేదికలను తనకు అందజేయాలన్నారు. హిందూపురంలో మంగళవారం నుంచి సదరన్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 30వ తేదీన గోరంట్ల మండలం మల్లాపల్లిలో వైఎస్సార్ జగనన్న కాలనీకి ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. 24వ తేదీ లోపు అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, వ్యవసాయ అధికారి సుబ్బారావు, డిఎంహెచ్ఒ కష్ణారెడ్డి, జౌళి శాఖ ఏడీ రమేష్, పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు



టిడిపి మేనిఫెస్టోని ప్రజలకు వివరిస్తున్న బికె పార్థసారథి

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి -పెనుకొండ


టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని 6, 7, 8 వార్డుల్లో సోమవారం టిడిపి నాయకులు మినీ మేనిఫెస్టో, భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి పథకాలపై ప్రచారం నిర్వహించారు. అంతకుముందు బికె పార్థసారథి, ఆయన సతీమణి కమలమ్మకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి పథకాలను మహిళలు, ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, అనసూయమ్మ, నాగమణి, లీలావతి, గాయత్రి, బేబీ, సువర్ణమ్మ, రత్నమ్మ, హేమలత, చంద్రకాంతమ్మ, జయమ్మ, లక్ష్మీదేవి, లక్ష్మమ్మ, దేవి, నాగమణి, పార్వతి, గంగ, శ్రావణి, లలిత, దివ్య, త్రివేణి, హబీబ్, షబానా, చాంది, మండల కన్వీనర్ సిద్దయ్య, రవిశంకర్, కేశవయ్య, మునిమడుగు వెంకటరాముడు, అశ్వర్థప్ప, సర్పంచి శ్రీనివాసులు, హుజూర్, జావిద్, లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, పోతిరెడ్డి, రఘువీరాచౌదరి, దారపనేని రామలింగ, పాలడుగు చంద్ర, ఈశ్వరయ్య, పెద్దన్న, బెల్లం శివశంకర్, నారాయణ నాయక్, తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సచివాలయ భవనం పునాదులకే పరిమితం

నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్ సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి-మడకశిర

అమరాపురం మండల పరిధిలోని ఊదుగూరు గ్రామంలో సచివాలయ భవనం పునాది దశలోనే పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో సోమవారం నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్ సందర్శించి సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి స్వగ్రామమైన ఊదుగూరు గ్రామంలోనే సచివాలయ భవనం నాలుగేళ్లయినా పునాదులకే పరిమితం కావడం వైసిపి పాలనకు నిదర్శనం అన్నారు. రూ. 40 లక్షలకు పైగా నిధులు మంజూరైనా ఎమ్మెల్యే స్వగ్రామంలో సచివాలయం, వెల్నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణాలు పూర్తి కాకపోతే ఇక నియోజకవర్గంలోని గ్రామాల్లో పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. నియోజకవర్గం లో జరిగిన అభివృద్ధిపై ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యేని డిమాండ్ చేశారు. సచివాలయ భవనాలను వెంటనే పూర్తి చేయక పోతే నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో దశలవారీగా ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాలు చేపడగామని హెచ్చరించారు.



సచివాలయ భవనం పునాది వద్ద జయకుమార్ సెల్ఫీ ఛాలెంజ్

అధికారుల పర్యవేక్షణ లోపం

డ్వాక్రా సంఘం నిర్వహణకు ఇబ్బందులు


ప్రజాశక్తి-తనకల్లు

వెలుగు అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా డ్వాక్రా సంఘం నిర్వహణ ఇబ్బందుల్లో పడింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మండల కేంద్రంలోని తారకరామ నగర్‌లో గత 2019వ సంవత్సరంలో శ్రీ విఘ్నేశ్వర మహిళా సంఘం పేరుతో సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 11మంది సభ్యులతో కలిసి ప్రతినెలా క్రమం తప్పకుండా సంఘాన్ని నడుపుకుంటూ బ్యాంకు నుంచి రుణం పొందారు. జీవనోపాధి చేసుకుంటూ సంఘాన్ని కొనసాగిస్తున్నారు. అయితే సంఘంలోని ఇద్దరు సభ్యులు సక్రమంగా కంతులు చెల్లించకుండా ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంపై మిగిలిన సభ్యులు ఏపీఎంకు ఫిర్యాదు చేశారు. ఆయన విషయాన్ని సిసి దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఆయన ఈ సమస్యను పరిష్కరించకుండా మిన్నకుండాపోయారు. దీంతో మిగిలిన సభ్యులు సంఘం కార్యకలాపాలను జరుపుకోలేక ఇబ్బంది పడుతున్నారు. వెంటనే సంబంధిత మండల అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించి సంఘాన్ని పూర్తి స్థాయిలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆ విఘ్నేశ్వర మహిళా సంఘం సభ్యులు కోరుతున్నారు.

పంచాయతీ వార్డు మెంబర్లకు 'గుండుమల' అభినందనలు

ప్రజాశక్తి-మడకశిర

ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో టిడిపి మద్దతుదారులుగా గెలిచిన వార్డు మెంబర్లను సోమవారం నియోజక వర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి అభినందించారు. నియోజకవర్గంలో మూడు పంచాయతీ వార్డు స్థానాలకు ఎన్నికలు జరగ్గా మూడింటిని టిడిపి మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. అమరాపురం మండలం నిద్రఘట్ట పంచాయతీ వార్డు మెంబర్‌గా కంచమ్మ మహాలింగప్ప, అగళి వార్డు మెంబర్‌గా నరసింహమూర్తి, గుడిబండ మండలంలోని గుణేమోరుబాగల్ పంచాయతీ ఆచార్యపాళ్యం వార్డు మెంబర్‌గా నరసింహప్ప విజయం సాధించగా గుండుమల శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వార్డ్ మెంబర్లు గెలవడానికి కృషి చేసిన ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అగళి జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ కుమారస్వామి, ఇన్‌ఛార్జి శివకుమార్, శ్రీనివాస్, అమరాపురం మండ ల కన్వీనర్ గణేష్, కృష్ణమూర్తి, మీనాక్షిరామిరెడ్డి, మండల కన్వీనర్లు మదనకుంటప్ప, దుర్గేష్, ఐటిడిపి తాలూకా అధ్యక్షుడు కాంతరాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.




గెలిచిన వార్డు మెంబర్లను అభినందిస్తున్న గుండుమల తిప్పేస్వామి

తూతూమంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం ఎంపిపి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమా వేశాన్ని తూతూమంత్రంగా నిర్వహించారు. ఉదయం 11:30 గంటలైనా అధికారులు ఫుల్, ప్రజాప్రతినిధులు నిల్ అన్నట్లుగా సమావేశ హాలు దర్శనమిచ్చింది. వచ్చిన కొందరు సర్పంచులు కూడా సమావేశాన్ని బాయ్ కట్ చేశారు. దీంతో కొద్దిసేపు సమావేశ హాలు నిర్మానుషంగా ఉండిపోయింది. అనంతరం సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఏ ఒక్కరూ సక్రమంగా కార్యాలయంలో ఉండడం లేదని, ఉన్నతాధికారులు చెబితేనే స్పందిస్తారని, ప్రజాప్రతినిధులకు కనీస గౌరవ మర్యాదలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. స్పందించిన ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్ సచివాలయంలో ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ ప్రకారం గౌరవ మర్యాదలు ఇవ్వాలని, సమయపాలన తప్పకుండా పాటించాలని సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. సమావేశా నికి హాజరు కాని మండల అధికారులపై ఇంతవరకూ ఏ ఒక్కరికీ మెమోలు జారీ చేసిన పాపాన పోలేదని ధ్వజమెత్తారు. వివిధ సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ముఖ్యంగా ఉపాధి పనులు, సచివాల య, ఆర్‌బికె భవనాలు త్వరితగతిన పూర్తి కాకపోవడం పై సభ్యులు మండిపడ్డారు. కాగా సమావేశంలో ఫ్యాన్లు లేకపోవడంతో సభ్యులు, అధికారులు తీవ్ర ఇబ్బం దులు పడ్డారు. సమావేశంలో తహశీల్దార్ అనంతాచారి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు అనురాధ, సుజాత, ఎస్ఐ నాగస్వామి, పంచాయతీ కార్యదర్శులు, ఎఇఒ అంజాద్, సర్పంచులు, ఎంపిటిసిలు, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, వైస్ ఎంపిపి, తదితరులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి





కదిరి, హిందూపురం, ధర్మవరంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఆయా ప్రాంతాల నాయకులు

ప్రజాశక్తి కదిరి టౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జి ఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని. సిపిఎస్ ను రద్దు చేయాలని చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈసందర్భంగా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి బంగ్లా నుండి అంబేద్కర్ సర్కిల్, ఇందిరాగాంధీ సర్కిల్, జీమాన్ సర్కిల్, ఎగ్బాల్ రోడ్, హిందూపూర్ క్రాస్ టవర్ క్లాక్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల మొండి వైఖరి ప్రదర్శిస్తోందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కార్మికుల రెగ్యులర్ చేయాలని ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ పట్టణ అధ్యక్షులు జనార్ధన, కార్యదర్శి బాలకృష్ణ, జిల్లా కోశాధికారి తిరుపాలు, నరసింహమూర్తి, రాజు, చెన్నకృష్ణ, రామాంజులు, చంద్రప్ప, సిఐటియు నాయకులు జి.ఎల్. నరసింహులు, సాంబశివ, జగన్మోహన్, రామ్మోహన్,ముస్తక్, నారాయణ పాల్గొన్నారు.

హిందూపురం : మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 24వ తేదీన చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఇందిరా పార్కును నుండి మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ ఎస్ వెంకటేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతు మున్సిపల్ కార్మికుల, ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, టైమ్ స్కేల్ వర్తింపజేయాలని, కార్మికులను వెంటనే పర్మినెంటు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియూ అనుబంధ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆ నిరవధిక సమ్మెకు వెళ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పి నరసింహప్ప, పట్టణ అధ్యక్షులు జగదీష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, ఆనంద్, రామాంజినప్ప, బాబయ్య, రామచంద్ర, చంద్ర, బాలాజీ, మంజు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు నాయకులు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు ఆదినారాయణ, అయూబ్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామనిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి నామాల నాగార్జున తో పాటు షేక్షావలి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు బాబు, చెన్నకేశవులు, గౌరవ అధ్యక్షులు పుల్లన్న, ప్రసాద్, ముకుంద, వెంకటేష్, వెంకట రాముడు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్‌షాక్‌కు గురైన మహిళ మృతి

బత్తలపల్లి : తాడిమర్రి మండలంలోని కొండయ్య పల్లి గ్రామంలో గత సంవత్సరం జరిగిన విద్యుత్‌షాక్‌తో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ సోమవారం మృతిచెందింది. గత ఏడాది విద్యుత్‌వైరు తెగిపడి ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలు అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో గాయాలతో బయటపడిన గుడ్డంపల్లి గ్రామానికి చెందిన మహిళా కోంకా గాయత్రి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఆమె బంధువులు తెలిపారు.

దారిదోపిడీ దొంగలు అరెస్టు

ఓబుల దేవర చెరువు : ఇద్దరు దారిదోపిడీ దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపీ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలు... ఈనెల 20వ తేదీ రాత్రి కందుకూరు పల్లి గ్రామానికి చెందిన జయరామప్ప అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంలో సొంతగ్రామానికి వెళుతుండగా ఆకుతోటిపల్లి గ్రామ శివారులో కదిరి మండలం గజ్జల రెడ్డిపల్లికి చెందిన ఇద్దరు దారి దోపిడీ దొంగలు అతనిని అడ్డగించారు.కత్తితో బెదిరించి అతని వద్ద నుండి 300 రూపాయలు డబ్బులు, ఒక సెల్ ఫోను లాక్కొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆకుతోటి పల్లి గ్రామస్తులు సహాయంతో నిందితులను అరెస్టు చేశారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ గోపీ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

హిందూపురం : పట్టణంలోని చర్చి గ్రౌండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారంతో వన్‌టౌన్ ఎస్ఐ హరూన్‌బాషా ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుని బంధువులు ఎవరైన ఉంటే వన్‌టౌన్ పోలీసులకు కలవాలని ఆయన కోరారు.

కేబుల్ వైరు చోరీ

కొత్తచెరువు : స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని వ్యవసాయ బోర్లకు ఉన్న మోటార్ కేబుల్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీ చేశారు. దాదాపు 20 మంది రైతులుకు చెందిన మోటార్లకు ఉన్న కేబుల్ వైర్లను కత్తిరించుకుని వెళ్లారు. సోమవారం ఉదయం గమనించిన రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

రొద్దం : మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ సోమవారం సాయంత్రం తన ఇంట్లో ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన పెనుగొండకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురంలోని సవేరా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కాగా ప్రేమించిన అమ్మాయి మోసం చేసిందని, అందుకే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని నవీన్ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగస్వామి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కర్నాటక మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

గోరంట్ల రూరల్ : కర్నాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్లు సిఐ ఎం.సుబ్బరాయుడు తెలిపారు. సిఐ తెలిపిన వివరాల మేరకు.. అందిన సమాచారం మేరకు కాపు కాచి మండల పరిధిలోని మిషన్ తండా గ్రామానికి చెందిన ఆర్.జయరామ్‌నాయక్ మల్లాపల్లి గ్రామానికి చెందిన బూచేపల్లి మహమ్మద్‌కు అతడి ఇంటి వద్ద కర్నాటక మద్యం ప్యాకెట్లు అమ్ముతుండగా దాడుల చేసి ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. అలాగే వారి నుంచి మొత్తం 223 కర్నాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందుతులను కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ సి.బాబు, కానిస్టేబుల్ వెంకటేష్, లోకేశ్వర్, సిద్ధు, సిబ్బంది పాల్గొన్నారు.

రఘువీరారెడ్డి ఎంపిక పట్ల హర్షం

కొత్తచెరువు : జాతీయ కాంగ్రెస్ పార్టీలో సిడబ్ల్యూసి మెంబర్‌గా మాజీ మంత్రి రఘువీరారెడ్డి ఎంపిక పట్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆపార్టీ నాయకులు బెల్లం నజీర్, మారాల ఓబులేసు, మోహన్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన కృషి చేస్తారన్నారు

మట్టిమాఫియాపై చర్యలు తీసుకోండి

ధర్మవరం టౌన్ : బత్తలపల్లి మండలంలో మాల్యవంతం వద్ద ఉన్న చెరువులోని మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలించుకుని సొమ్ముచేసుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు కోరారు. ఈమేరకు ఆపార్టీ నాయకులు ముసుగుమధు తదితరులు కలిసి ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. సోమవారం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగుమధుతోపాటు నాయకులు డీఎస్పీని కలిసి మట్టిమాపియాపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ కాటమయ్య, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల నిరసన

కదిరి టౌన్ : ఉమ్మడిజిల్లాలో సత్యసాయి తాగునీటి సరఫరా పథకంలో పని చేసే సిబ్బంది పంపు హౌస్ వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ సత్యసాయి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ఎల్ అండ్ టి కంపెనీ ఐదు నెలల వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 25వ తేదీ నుండి నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాటర్ సప్లై సిబ్బంది మదన్ కుమార్, రాధా గౌడ్, మునీర్‌బాషా, బాలాజీ నాయక్, రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

నంబుల పూలకుంట : మండల కేంద్రంలో ఉండే జడ్పీ హైస్కూల్‌ను డిఇఒ మీనాక్షి శుక్రవారం తనిఖీ చేశారు. తొమ్మిదో తరగతి విద్యార్థుల హోంవర్క్. నోటుబుక్కులు, లాప్టాప్‌లు వివిధ తరగతులు వారి నోటు పుస్తకాలను పరిశీలించారు. వర్క్ బుక్కులుఎంతవరకు కరెక్షన్ చేశారని పరిశీలించారు. ఈసందర్భంగా వివిధ అంశాల మీద హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

ధర్మవరం టౌన్ : ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలంటూ శ్రీసత్యకృప మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు శ్రీసత్యకృప మహిళా డిగ్రీకళాశాల విద్యార్థినులు సింగల్ యూస్ ప్లాస్టిక్‌నిషేధకరణపై పట్టణ ప్రధాన వీధులగుండా ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఇంటిలో ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలన్నారు. ఈ ర్యాలీలో కళాశాల కరస్పాండెంట్ డోలాపెద్దిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మోడీ విధానాలు దేశానికి ప్రమాదకరం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రధాని నరేంద్ర మోడీ విధానాలు దేశానికి పెను ప్రమాదమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం కన్వీనర్ బాలాజీ మనోహర్ పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తిలో కోటా లాడ్జిలో ఆ పార్టీ విస్తృతస్థాయి సమావేశం సీనియర్ నాయకుడు కోటా సత్యం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నియోజకవర్గ కోఆర్డినేషన్ సభ్యులు ఏడుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా కన్వీనర్ బాలాజీ మనోహర్ మాట్లాడుతూ చంద్రబాబు, పవన్, బిజెపి ఒకటే అన్నారు. గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అంటూ జత కడతారన్నారు. ముఖ్యమంత్రి జగన్ కేసుల వల్ల రాష్ట్ర ప్రయోజనాల గురించి నిలదీయలేని నిస్సహాయకుడిగా మారాడన్నారు. తగినన్ని సీట్లు ఇస్తే మెడలు వంచుతానని ప్రగల్బాలు పలికిన జగన్ ఈ నాలుగున్నర ఏళ్లలో బిజెపి పెద్దలకు సాష్టాంగాలు పెడుతున్నాడని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మతోన్మాద అల్లర్లు సృష్టించడం, యుద్ధ బూచి చూపడం బిజెపికి పరిపాటిగా మారిందన్నారు. రాష్ట్రానికి విభజన హామీలు, ప్రత్యేక హోదా కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. బిజెపిని ఎదుర్కొనే సత్తా

కాంగ్రెస్ నాయకులు బాలాజీ మనోహర్

కాంగ్రెస్‌కే ఉందన్నారు.కోఆర్డినేషన్ సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని, ఎమ్మెల్యే అభ్యర్థిని కూడా వారే నిర్ణయిస్తారని చెప్పారు. సిడబ్ల్యూసి సభ్యుడుగా రఘువీరా రెడ్డి ఎంపిక కావడం పట్ల ఆయనతో పాటు కోటా సత్యం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పార్టీకి పూర్వ వైభవం రానున్నదన్నారు. అసెంబ్లీ కోఆర్డినేషన్ సభ్యులుగా కోటా సత్యం, కోట శ్వేత, మాజీ ఎమ్మెల్యే నాగరాజు రెడ్డి, మహమ్మద్ గౌస్, ప్రసాద్, మనోహర్ నాయుడు, గౌస్‌బాషా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు వేమనారాయణ, కొండకమర్ల బాబు, పాముదుర్తి రవికుమార్, అమానుల్లా, పుట్ల గంగాద్రి, జమీల్, తిరుపాల్, పోతుల రాజు, మారాల ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడం : జనసేన



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

అక్రమ కేసులకు జనసేన నాయకులు భయపడే ప్రసక్తే లేదని జనసేన నాయకులు అన్నారు. కర్నాటక రాష్ట్రం బాగేపల్లిలో గత నెల 29న అక్రమ కేసు నమోదు చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనసేన ఇన్‌చార్జ్ ఆకుల ఉమేష్, చిలుమత్తూరు మండల అధ్యక్షుడు చిన్న ప్రవీణ్ మాట్లాడారు. 20 రోజుల క్రితం ఓ మోసకారి మాటలు నమ్మి జనసేన పార్టీ నాయకులపై అధికార పార్టీ నాయకులు కర్నాటక పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసులు బనాయించడం హేయమైన చర్య అని అన్నారు. కదిరి నియోజకవర్గానికి చెందిన రమేష్ బాబు అనే వ్యక్తి మాంగల్య సిల్క్ హౌస్‌కు లోను ఇప్పిస్తానని చెప్పి రూ.3 లక్షలు నగదు తీసుకున్నాడన్నారు. సకాలంలో లోన్ ఇప్పించక పోవడంతో ఆయనపై ఆరా తీస్తే అతనను మోసం చేసినట్లు తెలుసుకున్నామన్నారు. ఈనేపథ్యంలో కర్నాటక సరిహద్దులో బాగేపల్లి వద్ద ఒక రెస్టారెంట్ దగ్గర రమేష్ బాబు కనిపించగా తమకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వాలని అడిగితే ఇచ్చేదే లేదని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చి వాగ్వాదానికి దిగాడన్నారు. దీంతో బాగేపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామన్నారు. రెండు నెలల్లో డబ్బులు ఇస్తానని రాతపూర్వకంగా రాసి ఇచ్చారన్నారు. రమేష్ బాబుకు హిందుపురం నియోజకవర్గంలో కొంతమంది నాయకులు అండగా నిలుస్తూ తమపై లేనిపోని నిందలు వేసి బాగేపల్లి పోలీస్ స్టేషన్‌లో తమపైనే అక్రమంగా కేసు నమోదు చేయించి ఎఫ్ఐఆర్ చేశారని విమర్శించారు. తమకు న్యాయం జరిగేంత వరకు అవసరమైతే హైకోర్టుకు వెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు శేఖర్, నాయకులు రమణ, భాస్కర్, అంజినేయలు, లక్ష్మణ మూర్తి, నవీన్ ప్రభు, నాగభూషణ, కిషోర్, మనిప్రియ, శేఖర్ కన్నా, హనుమంతు, గాజుల నాగభూషణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ



మృతుడి కుమారుడితో మాట్లాడుతున్న కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్

రూరల్ మండలం చిన్నదిగువపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బొగ్గిటి చలపతి నాయుడు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భగా రూ.50వేలను మృతుని కుమారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తలపల్లి రామచంద్ర నాయుడు, మాజీ సర్పంచి వై కొండయ్య నాయుడు, గంగాద్రి నాయుడు, అక్కులప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ మొక్కలు నాటి సంరక్షించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రతి విద్యార్థి మొక్కలను నాటి వాటిని పోషించాలని గ్రీన్ భారత్ ఫౌండర్ రెడ్డి వారి శంకర్ నారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం పుట్టపర్తి మండల పరిధిలోని బీడుపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే మొక్కలను నాటించారు. ఇలా పాఠశాలలోనూ నివాసాల ముందు, పెరట్లో చెట్లు పెంచి కాపాడితే భవిష్యత్తులో ఆక్సిజన్ కొరత ఉండదని అన్నారు. ప్రతి గ్రామంలోనూ కొంతమంది పచ్చదనం పోషించే వారిని గుర్తించి విరివిగా మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని తెలిపారు. గ్రీన్ భారత ఆధ్వర్యంలో చెట్ల పెంపకం ఉద్యమంగా చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భారత్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వెంకట రత్నం, బీడుపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాల పరిశీలన

తనకల్లు : మండల పరిధిలోని వివిధ గ్రామాలలో రైతులు సాగు చేసిన పంటలను ఎపి రైతు సంఘం నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడక చాలామంది రైతులు పంట వేయలేదన్నారు. అరకొరగా వేసిన పంటలు కూడా తీవ్ర వర్షాభావంతో ఎండిపోయాయని అన్నారు. ప్రతి ఏడాది తనకల్లు మండలంలో సగటు సాగు విస్తీర్ణం 9వేల ఎకరాలుండగా ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదవడం వల్ల కేవలం 3 వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారన్నారు. భూగర్భ జలాల అడుగంటి వాణిజ్య పంటలైన టమోటా, అరటి, వంకాయ, మొక్కజొన్న, పంటలు కూడా ఎండిపోతున్నాయన్నారు. నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విత్తన వేరుశనగకాయలు కొనుగోలు చేసిన కొందరు రైతులు సకాలంలో వర్షంపడక పోవటంతో వేరుశనగ విత్తనాలు అతి తక్కువ ధరకు విక్రయించారన్నారు. బ్యాంకుల్లో గల అన్ని రకాల అప్పులు మాపీ చేయాలన్నారు. ఈ సంవత్సరం పంటను పెట్టి నష్టపోయిన వేరుశనగ రైతులకు ఎకరాకు 25 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. బొప్పాయి, అరటి, మొక్కజొన్న, టమోటా, రైతులకు ఎకరానికి 40 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వివి రమణ, ఎం శివన్న, కొట్టు వెంకటరమణ, శీన రైతులు పాల్గొన్నారు.

22 నుంచి ఆధార్ మొబైల్ కేంద్రాలు

ప్రజాశక్తి బత్తలపల్లి

మండలంలో ఈ నెల 22వ తేదీ నుండి 25 వరకు ఆధార్ మొబైల్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సౌజన్యకుమారి తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ విజయవాడ కార్యాలయం నుండి వచ్చిన ఆదేశాల మేరకు 22వ తేదీ నుండి 25వ తేదీ వరకు మొబైల్ ఆధార్ కేంద్రాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యదర్శులు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆయా కేంద్రాలలో వెరిఫికేషన్, మొబిలైజేషన్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యాశాఖ వారు. అంగన్వాడి సిబ్బంది తమ విద్యార్థులకు ఆధార్ కేంద్రాలలో ఆధార్ నమోదు చేయించుకోవాలన్నారు.

ఆలయ, మసీదు అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని 28వ వార్డు కేతిరెడ్డి కాలనీలో పీర్ల చావిడికి అక్కడే ఉన్న ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి 28వ వార్డు ఇన్‌చార్జి సరితాల బాషా విరాళం అందజేశారు. తనవంతుగా 40 వేల రూపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా సరితాల బాషా మాట్లాడుతూ ఆలయాలు, మసీదులు భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలను తెలియపరుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సరితాలబాషా కుమార్తె విద్య జాస్మిన్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

శ్రీ సత్యసాయి జిల్లాలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య సౌకర్యం కల్పించినందుకు కలెక్టర్‌ను సోమవారం సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సంఘ నాయకులు, జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబును కలసి విద్యాలయాలలో ఉచిత విద్య కొరకు వినతి పత్రం సమర్పించామన్నారు. స్పందించిన కలెక్టర్ జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యా సౌకర్యం కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఉత్తర్వులు జారీతో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యాసౌకర్యం కల్పనకు మార్గం సుగమనమైంది. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం ఐజెయు నేషనల్ కౌన్సిల్ మెంబర్ అయ్యన్న గారి శ్రీనివాసులు, అక్రిడేషన్ కమిటీ మెంబర్ పుల్లయ్య తో కలిసి జర్నలిస్టులు కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి సత్య సాయి బాబా చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు మదన్ మోహన్ రెడ్డి,కేశవ, హరికృష్ణ, మురళి, వంశీ, సాయికుమార్, నాగరాజు, గంగాధర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ దుకాణంలో కొండచిలువ

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి బైపాస్ రోడ్డు ప్రక్కన చికెన్ దుకాణంలో భారీ కొండచిలువ కలకలం రేపింది. సోమవారం చికెన్ సెంటర్ నడుపుతున్న ముత్తర్ నీటి కోసం వెళ్లగా నీటి డ్రమ్ములో భారీ కొండచిలువ ఉన్నట్లు గుర్తించాడు. దీంతో స్నేక్ క్యాచర్ కు సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకొని ఆ భారీ పామును పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేశారు. చికెన్ దుకాణం ప్రక్కన పెద్ద కొండ ఉండడంతో కోళ్ల కోసం ఆ భారీ కొండచిలువ వచ్చినట్లు స్థానికులు భావిస్తున్నారు.

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత : టిడిపి

బుక్కపట్నం : మహిళా సంక్షేమానికే టిడిపి అధిక ప్రాధాన్యత ఇస్తుందని టిడిపి సత్యసాయి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ , మండల కన్వీనర్ మలిరెడ్డి, ఎస్సీ సెల్ మహిళా అధ్యక్షురాలు యశోద రాయుడు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో మహాశక్తి కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తెలుగుదేశం మేనిఫెస్టోను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ తోనే మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మినీ మేనిఫెస్టో ద్వారా మహాశక్తి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందించడమే తెలుగుదేశం పార్టీ ప్రధాన ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్య గౌడ్, పార్లమెంట్ కార్యదర్శి మాధవి, నాయకులు వెంకట రాముడు, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో వివాదాలకు శాశ్వత పరిష్కారం

బత్తలపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకం ద్వారా భూములకు రక్షణ లభిస్తుందని, రీసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చెన్నరాయపట్నం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకం లో భాగంగా యాజమాన్య ఆస్తి ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. సర్పంచి కారాడమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి, జెడ్పీటీసీతో పాటు ఈవోఆర్డీ దివాకర్, ఉప సర్పంచి అంటినమ్మ, వైసిపి మండల కన్వీనర్ బయపరెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

హిందూపురం : ఈ నెల 24, 25వ తేదీలలో కదిరి పట్టణంలో నిర్వహించే జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబావలి పిలుపునిచ్చారు. ప్లీనరీకి సంబంధించిన కరపత్రాలను పట్టణంలో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతు భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలకు కదిరి పట్టణం వేదిక కానుందన్నారు. ఈ ప్లీనరీ సమావేశాలలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, హర్ష కుమార్, రంగ, బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దసరా కానుకపై హర్షం

కదిరి అర్బన్ : ఉపాధ్యాయులకు దసరా కానుకగా ఒక డీఏను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించడం హర్షనీయమని ఉపాధ్యాయ సంఘం నాయకులు మల్లు శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రికి ఉన్న అభిమానానికి గర్వపడుతున్నామని అన్నారు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు అడుగులు వేస్తున్న ముఖ్యమంత్రికి ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తరపున అభినందనలు తెలుపుతున్నామన్నారు.

ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా వి.రాఘవేంద్ర

కదిరి టౌన్ : కదిరి పట్టణానికి చెందిన వంకదార రాఘవేంద్రను ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు ముక్కాల ద్వారకనాథ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రాఘవేంద్ర మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఆర్యవైశ్య యువజన సంఘంలో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.